క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీఓ కోటేశ్వరావు

విజయపురి సౌత్: మాచర్ల మండలం బెల్లం కొండ వారిపాలెం, నాగులవరం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను మాచర్ల ఎంపీడీఓ కోటేశ్వరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు సంబంధించి ప్రతి రోజు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఆయా కేంద్రాల్లో వంటశాలలను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లీలావతి, మహిళా పోలీస్ జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా దాచేపల్లి పాఠశాల వార్షికోత్సవం

దాచేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ గురువారం నిర్వహించారు. హెచ్‌ఎం పి. శైలజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నగర పంచాయతీ మాజీ చైర్మన్ మునగా పున్నారావు, ఎస్‌ఎంసీ చైర్మన్ షేక్ సైసావలి పాల్గొన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని, ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, ఏసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల కల్యాణం



వెల్దుర్తి: గుండ్లపాడులో వేంచేసియున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వార్ల కల్యాణం కనుల పండువగా సాగింది. భక్తులు, మొక్కుబడులు, నైవేద్యాలు సమర్పించారు. అన్నదానం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

దాచేపల్లి: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన దాచేపల్లి-1 వార్డు సచివాలయంలో ఈ సమావేశం జరుగుతుందని, కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

వైఎస్సార్ ఆసరా.. 4,328 మందికి లబ్ధి

దాచేపల్లి: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు రూ.2.73కోట్ల లబ్ధి చేకూరనుందని నగర పంచాయతీ కమిషనర్ అనిశెట్టి శ్రీ విద్య, సెర్ప్ టీఎంసీ సయ్యద్ పెదజానీ, సీఓ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో 747 డ్వాక్రా గ్రూప్‌ల్లో 4,328మంది సభ్యులకు ఈ లబ్ధి చేకూరనుందని వెల్లడించారు.

నేడు లేగ దూడల ప్రదర్శన

దుర్గి: స్థానిక పశు వైద్యశాల ఆవరణలో లేగ దూడల ప్రదర్శన శుక్రవారం నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి దిలీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి రైతులు రెండు నుంచి ఆరు నెలల దూడలను తీసుకొనిరావాచ్చన్నారు. ప్రభుత్వ సీనియర్ వైద్యులు, శాస్త్రవేత్తలు పాల్గొని ప్రభుత్వం నుంచి పాడి రైతులకు అందిస్తున్న రాయితీలను, పథకాలను తెలియజేస్తారని చెప్పారు.

కూలి పెంచాలని నిరసన



గురజాల : కూలి రేట్లు పెంచాలని మట్టి పని కార్మికులు మాచర్ల-గుంటూరు రహదారిపై గురువారం బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని కూలి వంద రూపాయలు పెంచాలని అడిగినట్లు చెప్పారు. పనులు చేయకుండా నిలుపుదల చేస్తామే కానీ తగ్గించి కూలి పనులకు వెళ్లేది లేదన్నారు. ఘటనా స్థలం వద్దకు పోలీసులు చేరుకుని కార్మికులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కార్మికులు తదితరులున్నారు.

600 లీటర్ల నాటు సారా స్వాధీనం

- పరారైన ఐదుగురు నిందితులు
- తెలంగాణ నుంచి సరఫరా


స్వాధీనం చేసుకున్న సారా క్యాన్లను చూపుతున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది

మాచర్ల: వెల్దుర్తి మండలంలోని మారుమూల గ్రామం రామ చంద్రాపురంలో ఎస్ఈబీ అధికారులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. 30 క్యాన్లలో నిల్వ ఉంచిన 600 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రెడ్డి మాచర్ల పట్టణంలోని పిడబ్ల్యూడీ కాలనీలో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. తెలంగాణ ప్రాంతం నుంచి నాటు సారా అక్రమ రవాణపై సమాచారం మేరకు.. దాడులు చేశామన్నారు. రామచంద్రాపురం కృష్ణానది ఒడ్డున తెలంగాణ ప్రాంతం నుంచి పుట్టీలలో నాటుసారా తరలించి, అక్రమంగా అటవీ ప్రాంతంలో నిల్వ ఉంచిన 30 క్యాన్లను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఐదుగురు దాడులకు వెళ్లిన సమయంలో పారిపోయారని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని ప్రసాద్‌రెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోండి


మేనేజర్‌ను అభినందిస్తున్న వెంకటేశ్వర్లు

గురజాల : చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ టి.కామేశ్వరరావు సూచించారు. పులిపాడు గ్రామంలో బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతో బ్రాంచ్‌లు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం పి.మారుతీరావు, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), రైల్వే బోర్డు మెంబర్ కొమ్మినేని రవిశంకర్, మాజీ ఎంపీపీ కె.మట్టయ్య, నాగెండ్ల రామచంద్రరావు, చిన్నం అమరలింగయ్య, బ్యాంక్ మేనేజర్ సూర్యతేజ తదితరులున్నారు.

జగనన్న తోడులో చిరువ్యాపారులకు రుణాలు

- వైఎస్సార్ ఆసరా పథకం 3వ విడత ప్రారంభం
- 770 గ్రూపులకు గాను రూ.5.24 కోట్ల లబ్ధి


మాట్లాడుతున్న ఏపీఎం పి.వి.రంగారెడ్డి

బొల్లాపల్లి : స్థానిక వెలుగు పథకం కార్యాలయంలో గ్రామసమైక్యసంఘం సమీక్షా సమావేశం గురువారం ఏపీఎం పి.వి.రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ సమైక్యసంఘాల పరిధిలో స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలు, సామాజిక పెట్టుబడి నిధుల కింద ఇచ్చిన రుణాలను వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి రుణాలు పొందాలని తెలిపారు. జగనన్న తోడులో భాగంగా ప్రభుత్వం నుంచి చిరువ్యాపారులకు రూ.10వేలు ఆర్థికచేయూత అందుతుందని, ఈ పథకంలో తీసుకున్న చిరు వ్యాపారులు రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు. వైఎస్సార్ ఆసరా పథకం 3వ విడతలో లబ్ధి పొందిన వివరాలను గడపగడపకు ప్రచార నిర్వహణ ఉంటుందన్నారు. ఈ పథకంలో 770 మహిళా పొదుపు సంఘాలకు గాను రూ.5.24కోట్ల మేర లబ్ధిపొందారని తెలిపారు. ఈ నెల 25న ఈ పథకం 3వ విడత లాంఛనంగా ప్రారంభం కానుందన్నారు. సమీక్షా సమావేశంలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వెల్లటూరు రోడ్డులోని ఎంపీసీ ఫంక్షన్ హాల్‌లో అసిస్ట్, ఐటీసీ బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో వినుకొండ, నూజెండ్ల, బొల్లాపల్లి మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించిన హెచ్‌ఎంలకు స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు సంబంధించిన వర్క్‌షాప్ నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జాస్తి రంగారావు, డాక్టర్ ఎల్. వెంకట్రావులు స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌పై అవగాహన కల్పించారు. ఈ అవార్డు కావాలంటే ఎలా ఎంపిక చేస్తారు, స్కూల్ ఎలా ఉండాలి అనే వివరాలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ టి.రామారావు, అసిస్ట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం. శ్రీనివాసరావు, సిబ్బంది హాజరయ్యారు.

మంచి మార్కులు సాధిస్తే ప్రోత్సాహకాలు


విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: విద్యాభ్యాసంలో పదో తరగతి మైలు రాయి వంటిదని గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఫేర్ వెల్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పరీక్షలకు హాజరుకానున్న 70 మంది విద్యార్థులకు తన స్వంత ఖర్చులతో పరీక్ష సామగ్రి అందించారు. పరీక్షల్లో సత్తా చాటి పల్నాడు జిల్లాలో పాఠశాలను మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేయాలన్నారు. మంచి మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తానన్నారు. పదో తరగతి పరీక్షలు విద్యాభ్యాసానికి తొలి మెట్టని, ఉన్నత విద్యాభ్యాసంలో రాణించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. గడిచిన కాలంలో పాఠశాలకు మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు మన గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్‌తో పాటూ వృత్తి విద్యా కోర్సుల్లో కూడా చదువుకునే అవకాశం ఉందన్నారు. విలువైన ఆస్తులను దొంగలు దొంగిలించినా, చదువును మాత్రం ఎవరూ దొంగిలించలేరని చెప్పారు.
పోటీతత్వం, క్రమశిక్షణతో మంచి మార్కులతో విజయం సాధించాలన్నారు. ఎవరూ ఆర్థిక కష్టాలతో చదువుకు దూరం కాకూడదనేది తన లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం సుందరరావు, గ్రామపెద్దలు యన్నం శివారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రూ.25.15 లక్షలకు అశీలు హక్కు


కార్యాలయంలో వేలంపాటలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ సిబ్బంది

నరసరావుపేట: పురపాలక పరిధిలో 2023-24 ఏడాదికి అశీలు వసూలు చేసుకునే హక్కుకోసం మున్సిపల్ కమిషనరు డి.శ్రీనివాసరావు అధ్యక్షతన రెవెన్యూ అధికారులు గురువారం నిర్వహించిన బహిరంగ వేలంపాటల్లో పలువురు గుత్తేదారులు రూ.25.15 లక్షలకు హక్కులు దక్కించుకున్నారు. కూరగాయల మార్కెట్‌లో అశీలు వసూలుచేసుకునే హక్కును నిమ్మిశెట్టి మల్లీశ్వరి రూ.21.20లక్షలకు పాడి దక్కించుకోగా, చేపలు, మాంసం మార్కెట్‌లో హక్కులను గోళ్లమూడి ఏసురత్నం రూ.1లక్షకు, కబేళా-1ను రూ.95వేలకు దక్కించుకున్నారు. కబేళా-2ను డి.నాగేశ్వరరావు రూ.2లక్షలకు పాటపాడుకొని దక్కించుకున్నారు. సండ్రీ మార్కెట్‌కు గుత్తహక్కుకోసం ఎవరూ ముందుకురాకపోవటంతో వాయిదా వేశారు. రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, రెవెన్యూ ఇనస్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కారెంపూడి: ట్రాక్టర్ ట్రక్కు సైడ్ డోర్లు తగిలి ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఒప్పిచర్లకు చెందిన మహంకాళి వెంకటేశ్వర్లు ఒప్పిచర్ల నుంచి గురజాలకు వెళ్తుండగా ఎదురుగా సైడు డోర్లు కట్టి ధాన్యం లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను క్రాస్ చేయబోయాడు. ఇంతలో ట్రాక్టర్ సైడు డోరు తగలడంతో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. అతని భుజం, ఛాతి భాగాలు బాగా లోతుగా తెగిపోయాయి. ఆయనను హుటాహుటిని 108లో నర్సరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

భగత్‌సింగ్ త్యాగం మరువలేనిది


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి

రెంటచింతల: దేశ స్వాతంత్య్ర పోరాటంలో భగత్ సింగ్ త్యాగం మరువలేనిదని ఏఎస్‌ఐ పి.హనుమంతురావు అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా.. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ ముగ్గురు జ్వలించే నిప్పురవ్వలన్నారు. కన్నెగంటి హనుమంతు సేవా సంఘం నాయకులు నారాయణపురం శ్రీనివాసరావు, గాదె లూర్దు మర్రెడ్డి, పూజల వెంకటేష్, పోలీస్ సిబ్బంది నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరెడ్డికి ఉగాది పురస్కారం

మాచర్ల: శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడిగా 20ఏళ్లుగా మాచర్ల, పరిసర గ్రామాల ప్రజలకు అనేక సేవలందిస్తున్న మెట్టు గోవిందరెడ్డి ఉగాది ఉత్తమ సేవా పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన ఉగాది ఉత్సవాల్లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నర్సరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు.

కారెంపూడి గౌరవాన్ని పెంచారు

కారెంపూడి: పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్ జానీబాషాను స్థానిక చెన్నకేశవ స్వామి దేవాలయంలో గురువారం రాత్రి స్థానిక కాపు నాయకులు సన్మానించారు. అక్బర్‌కు జిల్లా పదవి అప్పగించి, కారెంపూడి గౌరవాన్ని పెంచారని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకటరామిరెడ్డికి కాపు సంఘం నాయకులు పలిశెట్టి కోటేశ్వర రావు , కిల్లా చెన్నయ్య కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ షేక్ షఫీ, సర్పంచ్ రమావతు తేజా నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు పలిశెట్టి కోటేశ్వరరావు, కిల్లా చెన్నయ్య, బొమ్మిన శ్రీను, కిల్లా కాశి, పలిశెట్టి వెంకటేశ్వర్లు, పలిశెట్టి హనుమంతరావు, పలిశెట్టి రామకోటేశ్వరరావు, చింతల శ్రీనివాసరావు, కోరె సత్యం , పుట్టా లచ్చయ్య, చింతపల్లి రామ్మూర్తి, తెలగనేని వెంకటేష్, పలువురు అక్బర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో చెన్నకేశవస్వామి ట్రస్టు బోర్డ్ చైర్మన్ చల్లా వీర్ల వర ప్రసాద రావు, ఎంపీటీసీ షేక్ ఆరీఫ్, కొమ్ము చంద్రశేఖర్, పాతూరి రామిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం

నాదెండ్ల: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు సాతులూరు గ్రామంలోని రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారంతో వైభవంగా ముగిశాయి. రెండు రోజుల పాటూ జరిగిన వేడుకలకు గ్రామస్తులే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజు గురువారం వైసీపీ, టీడీపీ వర్గాలు పోటాపోటీగా విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గద్దె కోటేశ్వరరావు బృందం ఆధ్వర్యంలో రూ.5 లక్షల ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నందికుంట విఘ్నేశ్వరస్వామి కానుకల లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న అధికారులు

నాదెండ్ల: గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం దేవదాయశాఖ అధికారులు హుండీ లెక్కింపు నిర్వహించారు. గడిచిన రెండు నెలల కాలంలో హుండీ ఆదాయం రూ.1,00,346 లు, విరాళాల రూపంలో రూ.35 వేలు సమకూరినట్లు దేవదాయశాఖ అధికారి తులసీదాస్ చెప్పారు. ఈ ఆలయాన్ని సుమారు ఏడు నెలల క్రిందట దేవదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో స్వామివారికి భక్తులు కానుకల రూపంలో గానీ, హుండీ ఆదాయం గానీ సుమారు రూ.6.10 లక్షలు సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ పల్నాడు జిల్లా ఇన్‌స్పెక్టర్ కె.మంజూష, గ్రామ పెద్దలు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా సరస్వతి దేవి


శాకాంబరిగా దర్శనమిస్తున్న సరస్వతిదేవి

పిడుగురాళ్ల: పట్టణంలో ఉన్న నాగులు గుడిలో దేవి వసంత నవ రాత్రులలో భాగంగా సరస్వతి అమ్మవారు శాకంబరిగా గురువారం దర్శనమిచ్చారు. ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మడేలేశ్వర స్వామికి బోనాల సమర్పణ


బోనాలు సమర్పిస్తున్న భక్తులు

గురజాల: పులిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ మడేలేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా గురువారం మొదటి రోజు బోనాలు సమర్పణ జరిగింది. ఈ నెల 26న స్వామి కల్యాణం, 27న తిరుణాళ్ల నిర్వహించడం జరుగుతుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నూరు శాతం ఆధార్ అనుసంధానం చేయాలి


ఎంపీడీఓ షేక్ గౌసియాబేగం

రెంటచింతల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల జాబ్ కార్డులకు వారి ఆధార్ నంబర్‌తో అనుసంధానం వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ షేక్ గౌసియా బేగం అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని 11 గ్రామాల్లో 14,526 మంది జాబ్‌కార్డు కలిగి ఉన్నారని, ఇప్పటి వరకు 13,390 మందికి ఆధార్ అనుసంధానం చేయడం జరిగిందన్నారు. మరో 1,136 మందికి అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. 2023-24 సంవత్సరానికి 416 పనులను గుర్తించగా వాటికి ప్రభుత్వ అనుమతి లభించిందన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతందని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామచంద్రరావు, ఏపీఓ జయచంద్ర, కార్యదర్శులు అనంతకోటేశ్వరరావు, వెంకయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పథకానికి స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

మాచర్ల: బుగ్గ వాగు రిజర్వాయర్ నుంచి మాచర్ల పట్టణంలోని ఇంటింటికీ మంచినీరు సరఫరా చేసేందుకు రూ.82 లక్షలతో మంచినీటి పథక నిర్మాణానికి, పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. రూ.10 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకుల నిర్మాణానికి నర్సరావుపేట జిల్లా పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస రెడ్డి, డీఈ రవికుమార్, పట్టణ ఏఈ శామ్యూల్ వివిధ ప్రాంతాలను పరిశీలించారు. అంచనాలు రూపొందించారు. మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురక కిషోర్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు పరిశీలనలో ఉన్నారు. దాదాపు మూడు గంటలకు పైగా అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఆయా వార్డు కౌన్సిలర్లు ఎంఆర్‌ఎఫ్ రామాంజిరెడ్డి, బత్తుల రాజా, అల్లి జీవన్, గట్ల కోటిరెడ్డి, పోలా శ్రీను, కో-ఆప్షన్ మెంబర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులున్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు


వైద్యసేవలందిస్తున్న వైద్యులు ఆంజనేయులునాయక్, విజయ్‌నాయక్

కారెంపూడి: ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) అమలులో భాగంగా గాదెవారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్లు, వైద్య సిబ్బంది వేపకంపల్లి, పేటసన్నెగండ్ల గ్రామాల్లో గురువారం వైద్య సేవలందించారు. డాక్టర్ ఆర్.ఆంజనేయులు నాయక్, డాక్టర్ ఎం.విజయ్ నాయక్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయించుకున్న వారి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి, వైద్య సలహాలిచ్చారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు కూడా వెళ్లి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించారు. ఉదయం డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో ఓపీ చూశారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచి చూశారు. సీహెచ్‌ఓలు రాము, విజయలక్ష్మి, ఏఎన్‌ఎంలు సునీత, సాహినా, ఆశ వర్కర్లు ఉన్నారు.

స్వాతంత్య్ర పోరాట యోధులను ఆదర్శంగా తీసుకోవాలి


భగత్‌సింగ్, రాజ్‌గురు చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ నాయకులు

పిడుగురాళ్ల : స్వాతంత్య్ర పోరాట యోధులను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎంసీపీఐ నాయకులు అన్నారు. లెనిన్ నగర్‌లో ఎంసీపీఐ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర పోరాట యోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 92 వర్ధంతి నిర్వహించారు. ఎంసీపీఐ నాయకులు మాట్లాడుతూ.. సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని సహించలేని బ్రిటిష్ పాలకులు భారత దళారి, భూస్వామ్య వర్గాల అండతో 1931 మార్చి 23న భగత్‌సింగ్‌తో పాటు అతని సహచరులను ఉరి శిక్ష పేరుతో హత్య చేశారన్నారు. అలాంటి పోరాట యోధులను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కృష్ణ, పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణ నాయక్, సీఐటీయూ నాయకులు నారాయణ ఆంజనేయులు, గురువయ్య పాల్గొన్నారు.

జగనన్న కాలనీ వాసులకు సురక్షిత నీరు


మంచినీటి పథకం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు సాంబయ్య, కమిషనర్ శ్రీ విద్య

దాచేపల్లి: జగనన్న కాలనీ వాసులకు సురక్షిత నీటిని అందిస్తామని వైఎస్సార్ సీపీ నాయకుడు సాంబయ్య అన్నారు. దాచేపల్లి వైఎస్సార్ జగనన్న కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. గృహ లబ్ధిదారులతో మాట్లాడారు. సురక్షిత నీరు అందించాలని వారు కోరటంతో.. రూ.3లక్షల వ్యయంతో మంచి నీటి పథకం ఏర్పాటు చేస్తామని ఆయన సమాధానం ఇచ్చారు. కాలనీ ప్రధాన మార్గంలో సిమెంట్ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ పరిశీలనలో కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, నాయకులు అంబటి ఆంజనేయులు, శ్రీరాములు, మునగా శ్రీనివాసరావు, కొమ్ము బుజ్జి తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మాచవరం: గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వివాహిత గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వేమవరం గ్రామానికి చెందిన గల్లా సునీల్‌కు, తెలంగాణకు చెందిన ఎలీషా మేరీ (37)కి 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమారులున్నారు. కొంత కాలంగా మండలంలోని పిల్లుట్లలో నివాసం ఉంటున్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఈ నెల 21న ఇంట్లో ఎవరూ లేని సమయంలో మేరీ గడ్డి మందు తాగింది. చికిత్స కోసం గుంటూరు జీజీ హెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అధిక కట్నం కోసం వేధిస్తూ, శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేయడంతో తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని, అందుకు భర్త సునీల్, కుటుంబ సభ్యులే కారణమని మృతురాలి తల్లి కాశమ్మ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.